## ముగింపు

ఆమె నడిచే దారిలో వాసనలేని పువ్వులు కూడా గుబాళిస్తాయి. ఒంటరితనపు నిశిరాత్రిలో ఆమె దివ్వెలా వెలుగుతుంది. ఆమెను తల్చుకుంటే దీవెనలిచ్చే దేవతలు గుర్తొస్తారు. ఆమె దయనీయ నేత్రాలలో కరుణ వెలుగుతూ వుంటుంది. ఆమె భావుకుడి గుండెల్లో అజ్ఞాతంగా నిక్షిప్తమైన భావావేశం బాధాతప్తపు బతుకులో నిట్టూర్చే హృదికీ ఆమె మాటలు ఓదార్పునిస్తాయి.

ఇంతటి అమృతమూర్తికా జరిగింది ఈ ఘోరం!?

ఆకాశం కళ్ళు చెమర్చి, కుండపోతగా అశృధారలు కురిపించింది.

పృథ్వితలలంలోని వృక్షాలు ఆమెకు జరిగిన అన్యాయానికి దిగులుపడి మోడువారిపోయాయి.

"జిజాంత్రోపస్, జావా, నియాండర్తల్, సోలో, స్టేన్‌హెూమ్ దశలు దాటిన హెూమోసెపియన్ మానవుడు తన పూర్వపు వాసనలు పోగొట్టుకోలేదేం?!

వివిధ రాక్షస రూపాలతో అవి అవతారాలెత్తుతూనే వున్నాయి.

ఆ అకృత్యం నిన్న, నేడు... రేపు...

ఇక్కడ... అక్కడ.... ఎక్కడెక్కడో....

ఆవేశంగా, ఆవేదనగా రాస్తున్న కిరీటి కలం ఆగిపోయింది. అంతవరకూ రాయగలిగేడే గానీ జరిగిన అమానుషాన్ని రాయడానికి చేతులు వణుకుతున్నాయి. మనసులో అలజడి. లేచి నిలబడ్డాడు. కిటికీలోంచి చూసాడు. రోడ్డుమీద ప్రవాహంలా కదిలిపోతున్న జనసమూహం.

"అందరి ముఖాలూ బానే వుంటాయి, మాటలూ బానేవుంటాయి చిరునవ్వులు చిందిస్తారు. సానుభూతి వాక్యాలు పలుకుతారు, కాని మనసులోని మాలిన్యాన్ని, మర్మాన్ని చూడలేరేమో!" అనుకున్నాడు. సంచీ భుజాలకు తగిలించుకు వెళుతున్న ఇద్దరు కాన్వెంటు అమ్మాయిల్ని చూసాడు.. వారి మనసులు నిర్మలంగా వుంటాయి. భవిష్యత్తులో తమని వెంటాడే వాంఛల బాణాలనించి తప్పించుకోడానికీ, ఆబగా తడిమే చూపుల్నించి దాటి పోవడానికి వాళ్ళకు ఆత్మ స్థైర్యం నూరిపొయ్యాలి అలా ఊహించే అతడిదో లోకం, కుర్చీలో కూర్చుని కళ్ళు రుద్దుకున్నాడు. గతం ఛాయలా కదలాడుతోంది.

కిరిటీ ఆ వూరొచ్చి రెండు సంవత్సరాలు కావస్తోంది. గంపెడు సంసారాన్ని మోయాల్సిన బాధ్యత చిన్న వయసులోనే తండ్రి చనిపోతూ అప్పగించేడు. ఎమ్మే ఆఖరి సంవత్సరంలో వుండగా, ఉద్యోగం చేస్తూన్న తండ్రి చనిపోయాడు. తండ్రి ఉద్యోగం అతడికి దొరికింది. తన చదువు అర్థాంతరంగా ఆపకతప్పలేదు. తన వాళ్ళకు దూరంగా పట్టణంలో ఒంటరి జీవితం గడిపే అతడికి తోడుగా వుండేది రచనా వ్యాసంగం. సాహిత్యం అంటే అతడికి ప్రాణం. సాహిత్యమే ఊపిరిగా బతుకుతున్న అతడికి ఎవరి పరిచయం అవసరంలేదు. ఆ వీధిలోని పోస్టుమేన్, పేపర్ బాయికు తప్ప అతడి పేరు ఎవరికీ తెలీదు. అలా నిర్లిప్తంగా సాగిపోతున్న అతడి జీవితంలో అనుకోని సంఘటన ఎదురయ్యింది. కిరీటి వుండే ఇంటి వోనరు కొడుక్కి ఆ సంవత్సరమే పెళ్ళయ్యింది.

అతడు ఆ వూళ్ళోనే కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఆమెకు టెంపరరీగా లెక్చరర్ ఉద్యోగం అదే కాలేజీలో దొరికింది. పెళ్ళిరోజున ఆమెని చూసి

ఆశ్చర్యపోయాడు. 'ఎమ్మే'లో ఆమె అతడి క్లాస్‌మేట్ భారతి. యూనివర్శిటీలో ఆమెతో అతడెప్పుడూ మాట్లాడలేదు.

ఓ రోజు తలొంచుకుపోతున్న అతణ్ణి చూసి ఆమే పలకరించింది. భర్తకు పరిచయం చేసింది. రెండు సంవత్సరాలుగా తమ ఇంట్లో అద్దెకుంటున్న కిరీటితో పరిచయం భార్యద్వారా కలిగినందుకు అతడు ఆశ్చర్యపోయేడు. కిరీటిలోని వినయమూ, నెమ్మదీ చూసి అతడితో పరిచయం కొనసాగించేడు.

కిరీటితో భారతి సాహిత్య చర్చలు జరిపేది. అతడి కథల్ని, వ్యాసాల్ని నిష్పక్షపాతంగా విమర్శించేది. ఆమె భర్తకు సాహిత్యాభిలాష లేకపోయినా ఆ చర్చల్లో పాల్గొనేవాడు. ఆమె పరిచయంతో కిరీటిలో నూతనతేజం ప్రవేశించింది. కిరీటి స్వతహాగా నెమ్మదస్తుడు. అతను సృష్టించే పాత్రలు పరుష వాక్యాలు పలుకుతాయి వేదనాగ్నులు కక్కుతాయి, ప్రళయకాల ప్రభంజనంలా విరుచుకుపడతాయి. అతడు మాత్రం అతి సాధువు. భారతికి స్పష్టమైన అభిప్రాయాలున్నట్టు అర్థమయింది అతడికి. యూనివర్శిటీలో వుండగానే ఎన్నెస్సెస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. సోషల్ వర్కర్‌గా పేరు తెచ్చుకుంది. వీరనారి భారతి అనే నిక్‌నేమ్ వుంది ఆమెకు. జీవితాన్ని స్పర్శించే రచనలు చెయ్యమని ఆమె కిరీటిని ప్రోత్సహించేది.

ఆమె, అతడి రచనలకు అలంబన అయింది. అతని రచనా విధానంలో నూతన మార్పు వచ్చింది. సరిగ్గా అలా జీవితానుభవాల్ని, మనుషుల మానసిక బలహీనతల్నీ రచనల్లో ప్రతిబింబింప చేస్తున్న కిరీటి గుండె హఠాత్తుగా ఆగిపోయే దుర్ఘటన హఠాత్తుగా జరిగింది. ఓ సాయంకాలం ఆమెకు అతి దారుణ ఘోరం వాటిల్లి అతణ్ణి క్షణ క్షణం కుమిలిపోయేట్టు చేస్తోంది. మానసిక సంక్షోభం ఎక్కువై నిద్రపట్టడం లేదు.

"ప్లీజ్ నా కథ రాయరూ! నా కథకు ముగింపేమిటో చెప్పరూ" ఆమె ఆర్తిగా, ఆవేదనగా అంది రెండురోజుల క్రితం అతనితో ఆమెకు జరిగిన అన్యాయాన్ని కథగా రాసే దౌర్భాగ్యం పట్టినందుకు అతడిలో మనఃస్తాపం ఎక్కువవుతోంది. అయినా

తప్పదు, తను రాయాలి ఆమె చెప్పినట్లు దోపిడీకి, దారుణాలకు గురవుతున్న జీవితాల్ని స్పర్శించాలి రచనల్లో కిరీటి బాధను బలవంతంగా అణుచుకుని మరలా రాయడం ప్రారంభించేడు. భారతి కళ్ళముందు ప్రత్యక్ష మయింది. ఇప్పుడు ఆమె ఏం చేస్తోందో? అనుకున్నాడు.

* * * * *

భారతికి ఊపిరాట్టంలేదు. పైన వెంటిలేటర్ వుంది. పడుకున్న మంచానికి ఎదురుగా కిటికీవుంది. సీలింగ్ ఫేన్ తిరుగుతోంది. అయినా ఆమెకు ఉక్కిరిబిక్కిరిగా వుంది శరీరంనిండా ఆవిరులు కమ్ముకుంటున్నట్టుగా అవుతోంది. "ఈ గదిలోంచి బయటపడితే బావుండును. స్వేచ్ఛగా బయట గాలిలో తిరగాలని వుంది. ఆమెకు. కళ్ళనించి నీళ్ళు ఉబుకుతున్నాయి. ధైర్యాన్ని అతికష్టంమీద కూడదీసుకుంటోంది. మనసును మరో మార్గంలో మళ్ళించడానికి చదివిన పుస్తకమే చదువుతోంది. ఆ ఇంట్లోని వ్యక్తులు ఆమెను పరాయిదానిలా చూస్తున్నారు.

"ఏడడుగులు నడిచి, నిన్ను జీవితాంతం నా హృదయ సామ్రాజ్యంలో రాణిగా చేసుకుంటానని బాసలు చేసిన భర్తే ఆమె కళ్ళలోకి సూటిగా చూడలేకపోతున్నాడు. ఇంతకీ తను చేసిన ఘోరం ఏమిటి?

ఓ సాయంకాలం కాలేజీనుంచి బయటకొచ్చి బస్ స్టాపులో నించుంది. ఆమెను వెంబడించారో నలుగురు "మగాళ్ళు" బస్సు లేటు కావడంతో చూస్తుండగానే చీకట్లు అలుముకున్నాయి. స్కూటర్మీద భర్తతోపాటూ కాలేజీకి వచ్చేది. అతను ఊరెళ్ళడంతో బస్సుకోసం నిరీక్షించాల్సి వచ్చింది. తనతోపాటు బస్టాండులో నిలుచున్న వాళ్ళు తనలాగే బస్కోసం చూస్తూన్నారని పొరపాటు బడింది. నా దేశం అగ్నిపునీత సీత. నా దేశం భగవద్గీత, నా దేశం పావనగంగ అని కీర్తించబడ్డ ఈ దేశపుగడ్డమీద ఒంటరి స్త్రీలకు జరుగుతున్న అఘాయిత్యమే ఆమెకు జరిగింది. కన్నుమూసి తెరిచేలోగా ఆమెను దూరంగా చీకట్లోకి లాక్కెళ్ళిపోయారు. పశుబలం ముందు ఓడిపోయింది. ఒకరి తర్వాత ఒకరు...

దిగ్గున లేచింది భారతి. జరిగిన అకృత్యం కళ్ళముందే కదలాడుతోంది. వద్దనుకున్నా ఆ భీకరదృశ్యం పదే పదే గుర్తుకొస్తోంది. ఆ నలుగుర్నీ ఆమె గుర్తుపట్టగలదు. వారికి శిక్ష పడేటట్లు చేయగలదు. భర్త పరువు పోతుందనే భయంతో ఆమెను ఆపేసాడు. ఇంటికొచ్చిన ప్రెస్ రిపోర్టర్లను కనబడకుండా తనని ఇంట్లో బంధించేవాడు. నగర విమెన్స్ లిబ్ వాళ్ళు ఉద్యమం నడిపేందుకు రంగం సిద్ధం చేసినా తనపై అత్యాచారం జరగలేదని అబద్ధం చెప్పించారు. కాని, వాళ్ళు చేస్తున్నదేమిటి; తనను బయటకు తిరగనివ్వకుండా ఈ గదిలోనే వుంచి, తిండి మాత్రం పంపిస్తూ స్వేచ్ఛని కత్తిరించేసారు. వద్దంటున్నా కళ్ళనించి నీరు అవిరామంగా ఉబుకుతోంది. తనపై అత్యాచారం జరిగిన వెంటనే ఆమె ఇంటికొచ్చేసింది. ఆ సమయంలో పోలీస్‌స్టేషన్ కెళితే జరిగిన ఘోరమే పునరావృతం అవుతుందని భయపడింది.

తన విభుడు, తనని ప్రాణాధికంగా ప్రేమిస్తున్నవాడు పసిపాపలా చేసి ఓదారుస్తాడని ఆమె ఆశపడింది. అతడు వూరినించొచ్చే వరకు అత్తమామలు సాధించేరు. ఆ తర్వాత వచ్చిన అతను ఆమెను ఓదార్చలేదు సరికాదా "సేఫ్ పీరియడ్ కూడా కాదు. ఈ ఘోరానికి తోడు మరో ఉపద్రవం జరగకుండా చూడు అన్నాడు తలొంచుకునే.

తనకో ఎక్సిడెంట్ జరిగింది. ఆడపిల్లలు ప్రాణంకన్నా విలువగా భావించేదాన్ని తను పొగొట్టుకుంది. భర్త తనను ఓదార్చకపోగా మరెంత కుమిలిపోయేలా చేసాడు ఆ మాటలతో ఆలోచనల్లో ఆవేదనకు గురయిన భారతి బయటకు వెళదామని తలుపు తెరవబోయింది. వెనక గడియపెట్టేరు. గట్టిగా బాదిన రెండు నిమిషాలకు తలుపు తెరుచుకుంది. ఆమెను పలకరించకుండానే అత్తగారు హడావుడిగా వెళ్ళిపోయింది. బాత్రూమ్‌లోకెళ్ళి ముఖం కడుక్కుంది.

ముందు గదిలో డ్రెస్సింగ్ టేబిల్ అద్దంలో ముఖం చూసుకుంది. కళ్ళు ఏడ్చి ఏడ్చి ఉబ్బి ఉన్నాయి. క్రింద ఏర్పడిన నల్లటి చారికలు. జుట్టంతా చెదిరిపోయి

వుంది. తల దువ్వుకుందామనే ప్రయత్నాన్ని విరమించుకుంది. షెల్ఫ్‌లోని రెండు నవలలు తీసుకుంది. టేబుల్‌మీద లెటర్ పేడ్ కోసం చూసింది. అమ్మకు ఉత్తరం రాయాలి అనుకుంటూ భర్త రాసుకునే చేతులకుర్చీ మీద కనిపించింది. అది అందుకుని రెండు కాగితాలు చింపబోయేసరికి, ఏవో వాక్యాలు. ఇంచుమించుగా తన రాతని కాపీ చేసినట్టున్నాయి. ఆమె సంతకం ఇంపోజిషన్ రాసినట్లు పేజీ నిండా రాసేరు. అవి భర్త చేతిరాతఅని ఆమెకు అర్థమయింది అతడలా ఎందుకు రాసాడో ? ఆలోచిస్తోంది. తన ఆలోచనలకు రూపం ఏర్పడి ఆ ఊహ సరయినదా అని మథనపడ సాగింది. .... ఎవరూ లేరు అత్తగారు తప్ప. వీధిలోకి వెళ్ళే గేటుకు తాళం వేస్తుంది. ఆమెకు ఒంటరితనం ఆవరించింది. తనతో ఒక్కరూ మాట్లాడటం లేదు. తనేదో సాలెగూడులో చిక్కుకున్న భయంతో ఆమె మనసు పరిపరివిధాలా పోతోంది. కిరీటి కనిపిస్తే బాగుండును. రెండు రోజుల క్రితం బాత్రూమ్ కెళుతూ చూసిందతన్ని. గబగబా అనేసింది పిచ్చిగా.

"నా కథ వ్రాయరూ? నాకథకు ముగింపేమిటి?" అని ఆమెకు కొద్దికొద్దిగా అర్థమవుతోంది, నవలలోనూ, సినిమాల్లోను అత్యాచారం చేయబడిన స్త్రీల జీవితాలకు చావే ముగింపు ఇంత చదువూ చదివి, జీవితానుభవాల్ని పెంచుకొని ఎందరికో ఆదర్శంగా నిలిచిన తను చనిపోతుందా? ఆమెలో వీడని చిక్కు ప్రశ్నలు. ఈ అవమానంతో కాలేజీలో తలెత్తుకు తిరగ్గలవా? అత్తగారి సూటి ప్రశ్న గుర్తుకొచ్చింది.

"నిన్ను సినిమాలకు, షికార్లకు తిప్పే ధైర్యం నా కుంటుందంటావా? ప్రాణ నాథుడి ఆసందర్భప్రేలాపన మన ఇంటికొచ్చే అతిథులకు నిన్ను పరిచయం చెయ్యగలనా, మావగారు పరువు గురించి అంతర్మథనం చెందుతున్నాడు.

"మా ఇంటి మహాలక్ష్మి" అంటూ తనని అక్కున చేర్చుకున్న ఆ కుటుంబసభ్యులే ఆ దుర్ఘటనకు తననే దోషిగా చేసి మానసికంగా బాధిస్తుంటే ఆమె భరించలేకపోతోంది.

వాళ్ళందరి ఉద్దేశ్యం తను చనిపోతే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందనా? భారతి ఆలోచన తీవ్రతరమవుతున్నాయి. ఇంతలో స్కూటర్ ఆగిన

శబ్దం. కిటికీలోంచి చూసింది. గబగబా వస్తున్నాడు. చేతిలో ఏదో పాకెట్, తలుపు తీసిన అత్తగారి కళ్ళల్లో ఆందోళన.

"తల ప్రాణం తోకకొచ్చింది. అయినా తప్పదుకదా ఎన్నాళ్ళు దీన్ని గదిలోపెట్టి క్షోభపెడతా... భర్త మాటలు పూర్తిగా వినలేకపోఇయంది. మంచంమీద పడుకొని ఆలోచిస్తోంది. తననొదిలి ఒక్కక్షణం కూడా వుండలేని అతడు అలా దూరంగా మసలడం ఆమెకు బాధ కలిగిస్తోంది. "తన ఊరు వెళిపోతేనో? హార్ట్ పేషంటయిన అమ్మ, సాంప్రదాయపు నీడల్లో బ్రతికే నాన్న. తనను వాళ్ళు ఆదరిస్తారుగానీ క్షణక్షణం చస్తూ బ్రతుకుతారు. అలా ఆలోచిస్తున్న ఆమెకు భర్త రావడం కనిపించలేదు అతడికన్నా ముందే గుప్పునున్న ఆల్కాహాల్ వాసన ఆమెకు తగిలింది. ఉదయం భోంచెయ్యలేదట, ఆకలిగా లేదా? ఆ పాలు తాగి పడుకో! పాలగ్లాసు అందించి తలొంచుకుని నిలబడ్డాడు. ఆ మాటల్లో లాలింపులేదు. భర్త అనే అధికారం ఆమెకు కనిపించింది.

ఆమె మౌనంగా అయింది. "నువ్ పాలు తాగితేగానీ కదలను మొండిగా అన్నాడతడు. "ప్లీజ్ నన్ను బాధపెట్టకండి, మీరు వెళ్ళండి ఇక్కణ్ణించి గట్టిగా అరిచింది. అతను తూలుకుంటూ వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన కొద్ది సేపటివరకూ ఆమెతో ఆలోచనలు ఎక్కువవ్వసాగాయి. ఆ పాలగ్లాసును చూసేసరికి ఆమెకు భయం అధికమవుతోంది. "తన రాతను, సంతకాల్నీ ఫోర్జరీ చెయ్యడం, అత్తగారితో అతడంటున్న మాటలూ, ఎప్పుడూ లేనివిధంగా పాలగ్లాసుతో ప్రత్యక్షం కావడం ఈ విడి విడి ఘటనలను కలిపిచూస్తే తన బ్రతుక్కి అర్ధంతరంగా భర్త ఇస్తున్న ముగింపు...

ఆమె మరి ఊహించలేకపోయింది. పంచభూతాల సాక్షిగా పెళ్ళి చేసుకున్న మొగుడు తనను ఆ పంచభూతాల్లోనే కలిసేందుకు చేసే ప్రయత్నం...

ఆమె పాల గ్లాసును చేతిలోకి తీసుకుని ఒక నిర్ణయానికి వచ్చింది.

* * * * *

కిరీటికి నిద్రపట్టడంలేదు. భారతి కథ పూర్తయింది. గానీ ముగింపు దగ్గర కలం ఆగిపోయింది.

ఎలా ముగించాలో అతని ఆలోచనలకు అందడం లేదు. పిచ్చిగా రూములో తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం కనిపించిన భారతి మళ్ళీ కనబడలేదు. గంట క్రితం ఆమె భర్త స్కూటర్ దిగి తూలుకుంటూ వెళ్ళేడు. తను మాట్లాడడానికి ప్రయత్నించినా విసురుగా వెళ్ళిపోయాడు. కిరీటికి ఏదో ఆందోళనగా అనిపించింది మనసులో తలుపుకు తాళం వేసి బయటకు నడిచేడు.

భారతి గ్లాసులోని పాలను కిటికీలోంచి పారబోసింది. గ్లాసు అడుగును చేరిన తెల్లటి పదార్థం దానివంక భయంగా చూసి, ఆ గ్లాసు కూడా కిటికీలోంచి బయటకు విసిరింది. తన చీరలూ, జాకెట్లు, కొన్ని పుస్తకాలు గబగబా సూట్‌కేసులోకి సర్దుకుంది. కంగారుగా వెళ్ళిన భర్త తలుపు బార్లా తెరిచి వెళ్ళిపోయేడు. వేగంగా బాత్‌రూమ్‌వైపుకు నడిచింది. అంతా నిద్రపోతున్నారు.

ఆ నిశిరాత్రిలో అక్కడ్కడా మిణుకుమిణుకుమంటున్న నక్షత్రాలు, ఆమె ఒక్కసారి బావురుమంది పట్టుచీరతో, తలంబ్రాలతో తను ఆ ఇంటికి నడిచొచ్చిన పెళ్ళిరోజు గుర్తుకొచ్చింది.

గడియ పెట్టిన దొడ్డివైపు తలుపు తీసుకుని ఆమె వడివడిగా నడిచింది. చీకట్లో నడుస్తున్నా ఆమెకు భయం వెయ్యడంలేదు. చీకట్లోంచి వచ్చినందుకు ఆమెకు బైటంతా వెలుగే కనిపిస్తుంది.

ఆమెకు కొద్ది అడుగుల దూరంలో నడుస్తున్న ఓ ఆకారం తన అడుగుల సడికి తలతిప్పిన ఆ ఆకారాన్ని చూస్తూ "కిరీటీ!" అంది వస్తున్న తన కన్నీటికి తెరవేస్తూ.

* * * * *

సూట్‌కేస్ అందుకున్నాడు. అతడిని అనుసరించింది. దౌర్జన్యం,

దుర్మార్గంలాంటి చీకటి భయపెడుతున్నా అక్కడక్కడా మిణుకుమనే నీతి, నిజాయితీల వెలుగు, దారి చూపుతుండగా ముందుకు నడిచింది. నడుస్తున్న ఆమె ఆకాశం వంక చూసింది. అది చాలా విశాలంగా వుంది.

*- ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక 22-11-90*

* * * * *